

నల్లమల పులిబిడ్డ రేవంత్ రెడ్డి
రాజకీయ ప్రస్థానం
కాంగ్రెస్ రేసుగుర్రం
ఒకే ఒక్కడు
S tv SANDESH
ప్రతి మాట విలువైనది - ప్రతి దృశ్యం అరుదైనది
చరిత్ర
నిన్న జరిగింది నేటి 'చరిత్ర' - నేడు జరిగేది రేపటి 'చరిత్ర'
మన మాట
ప్రతి పదం ప్రజల పక్షం
ప్రత్యేక సంచిక
www.Sandeshtv.in
SANDESH PLUS

# మిన్ను విరిగి మీద పడ్డా

# పట్టిన పట్టు విడవని యోధుడు

## ఒక్కసారి నిర్ణయం తీసుకుంటే ప్రపంచమంతా అడ్డుపడ్డా ఆగడు



ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో..ఆ మాటకొస్తే భారత దేశంలోనే అరుదైన రాజకీయ నాయకుడు ఎనుముల రేవంత్ రెడ్డి. గాడ్ ఫాదర్ లేకుండా రాజకీయాల్లో ఒక్క అడుగు కూడా వేయలేరు. అటువంటిది ఏ పార్టీలోనూ లేకుండానే ఎన్నికల్లో తన సత్తా చాటిన అసలు సిసలు ప్రజానాయకుడిగా ఎంట్రీ ఇచ్చిన రియల్ హీరో రేవంతే. ఆయన విజయగాథ మామూలుది కాదు. తమ కెరీర్ లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలనుకునే ఎవ్వరికైనా సరే రేవంత్ రెడ్డి జీవితం తిరుగులేని పాఠం అనడంలో ఎలాంటి సందేహం లేదంటున్నారు మహేందర్ రెడ్డి. రేవంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానాన్ని దగ్గరగా గమనిస్తూ రావడమే కాకుండా రేవంత్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా ప్రజాజీవితంలో అడుగులు వేయాలని నిర్ణయించుకున్న మహేందర్ రెడ్డి రేవంత్ రెడ్డి ఎందుకు భిన్నమైన నాయకుడో చెబుతున్నారు. సందేశ్ మీడియాకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మహేందర్ రెడ్డి ఇంతవరకు ఎవరూ చూడని కొత్త కోణంలో రేవంత్ రెడ్డిని చూపిస్తూ అద్భుతమైన విశ్లేషణ చేశారు. మహేందర్ రెడ్డి మనసులోంచి వచ్చిన భావాల ఆధారంగా రేవంత్ రెడ్డిని అర్థం చేసుకునే ప్రయత్నం చేద్దాం.









రేవంత్ రెడ్డి తెలుగుదేశం పార్టీలో ఉన్నప్పుడే మహేందర్ రెడ్డికి ఆయనతో పరిచయం ఏర్పడింది. రేవంత్ రెడ్డి ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరినపుడు మహేందర్ రెడ్డి రేవంత్ వెన్నంటే అడుగులు వేశారు. చిన్న కార్యకర్తను కూడా పేరు పెట్టి బాగున్నావా? తిన్నావా? ఏంటి సంగతులు? అని ఆప్యాయంగా ఆరా తీసే గుణమే రేవంత్ రెడ్డి అంటే తనకు అభిమానం ఏర్పడ్డానికి కారణమంటారు మహేందర్ రెడ్డి. ఒక సారి ఒకరికి సాయం చేస్తానని మాట ఇస్తే హరి హరాదులు అడ్డొచ్చినా రేవంత్ రెడ్డి మాట తప్పరంటారు మహేందర్ రెడ్డి. ఏదైనా నిర్ణయం తీసుకోడానికి ముందే ఒకటికి పదిసార్లు ఆలోచన చేస్తారే తప్ప నిర్ణయం తీసుకుంటే ఇక వెనకడుగు వేసే ప్రసక్తే ఉండదని ఆయన అంటున్నారు. ఒక్క సారి కమిట్ అయితే ఆయన మాట ఆయనే వినడని రేవంత్ రెడ్డి నిజస్వరూపాన్ని ఆవిష్కరించారు మహేందర్ రెడ్డి.

Stv SANDESH
ప్రతి మాట విలువైనది - ప్రతి దృశ్యం అరుదైనది





# వేగుచుక్కలా వచ్చాడు వేకువ తెచ్చాడు

## రాజకీయాలకు కొత్త దారి చూపాడు...కొత్త వెలుగులు ఇచ్చాడు



రేవంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానాన్ని గమనిస్తే ఆశ్చర్యం వేయక మానదు. విద్యార్థి దశనుంచే రాజకీయాల పట్ల ఆసక్తి అవగాహన పెంచుకున్న రేవంత్ రెడ్డి ప్రజాసమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూనే ఎదిగారు. తాను ఉన్న ఊరిలో చుట్టూరా ఉన్న ప్రజలకు తలలో నాలికలా మారి అందరితో సన్నిహితంగా ఉండేవారు. కులాలు మతాలు ప్రాంతాలను ఎన్నడూ పట్టించుకోని పరమ లౌకిక మానవతావాది రేవంత్ రెడ్డి అంటారు మహేందర్ రెడ్డి. నాగర్ కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డి పల్లి గ్రామంలో 1969లో జన్మించారు రేవంత్ రెడ్డి. 2006 లో మిడ్జిల్ మండలం జెడ్పీటీసీ సభ్యుడిగా విజయం సాధించి తన రాజకీయ ఎంట్రీని ఘనంగా చాటుకున్నారు.



ఆ మరుసటి ఏడాదే 2007లో మహబూబ్ నగర్ స్థానిక సంస్థల స్థానం నుండి శాసన మండలి ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగారు. కాంగ్రెస్, టిడిపిల వంటి ప్రధాన పార్టీలను ఎదుర్కొని తిరుగులేని విజయం సాధించారు. ఆ విజయం రేవంత్ రెడ్డి పేరును ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో మార్మోగేలా చేసింది. రెండేళ్ల తర్వాత 2009లో టిడిపి తరపున కొడంగల్ నియోజక వర్గం నుంచి పోటీ చేసి భారీ మెజారిటీతో విజయం సాధించారు. ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగు పెట్టారు. అసెంబ్లీలో అవకాశాలు అంది పుచ్చుకుని తన నియోజక వర్గ సమస్యలతో పాటు వివిధ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. ఆయనలోని చురుకు తనం ప్రజల పట్ల ఉన్న మమకారాలను గమనించిన టిడిపి 2014లోనూ ఆయన్ను కొడంగల్ నుంచే పోటీకి దింపింది. వరుసగా రెండో సారి ఘన విజయం సాధించారు రేవంత్ రెడ్డి 2014 నుండి 2017 వరకు టిడిఎల్పీ శాసన సభాపక్ష నేతగా వ్యవహరించి రాజకీయాలపై తనదైన ముద్ర వేశారు.





ఈ క్రమంలోనే మారిన రాజకీయ సమీకరణలు..తెలంగాణా అవసరాలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణలో నామమాత్రంగా ఉన్న టిడిపికి గుడ్ బై చెప్పి కాంగ్రెస్ నాయకత్వం ఆహ్వానం మేరకు కాంగ్రెస్ లో చేరారు. అనతికాలంలోనే తెలంగాణా పిసిసికి అధ్యక్షుడు అయ్యారు. 2018 ఎన్నికల్లో కొడంగల్ నుంచి పోటీ చేసిన రేవంత్ రెడ్డి ఓటమి చెందినప్పటికీ ఆ మరుసటి ఏడాది జరిగిన లోక్ సభ ఎన్నికల్లో మల్కాజగిరి నియోజక వర్గం నుండి ఘన విజయం సాధించి ఎంపీ అయ్యారు. ఇక అక్కడి నుండి 2023 ఎన్నికల వరకు కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలోనూ ప్రజల్లోకి తీసుకుపోవడంలోనూ కీలక పాత్ర పోషించారు. బి.ఆర్.ఎస్. అధినేత కేసీయార్ కు చుక్కలు చూపించిన చిచ్చర పిడుగు రేవంత్ రెడ్డి మాత్రమే.





టిపిసిసి అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డిని నానా ఇబ్బందులూ పెట్టడానికి నాటి బి.ఆర్.ఎస్. ప్రభుత్వం చెయ్యని ప్రయత్నం లేదు. పన్నని కుట్ర లేదు. చివరకు రేవంత్ రెడ్డి బిడ్డ పెళ్లికి ముందు ఆయన్ను అరెస్ట్ చేయించి చాలా ఇబ్బంది పెట్టారు. ఇంత కష్టం వస్తే ఎవరైనా ఈ రాజకీయాలెందుకు అనుకుని దూరం జరిగిపోతారు. కానీ రేవంత్ రెడ్డి రాజీపడే రకం కాదు. ప్రత్యర్ధి తనని తొక్కేద్దామని చూస్తే..ఆ ప్రత్యర్ధినే తొక్కి నార



తీసే రకం రేవంత్ రెడ్డి. మాటకు మాట బదులివ్వనూ గలడు దెబ్బకు దెబ్బా తీయగలడు. అయితే రేవంత్ రెడ్డిని బి.ఆర్.ఎస్. నాయకత్వం చాలా తక్కువగా అంచనా వేసింది. కాంగ్రెస్ పార్టీని 2023 ఎన్నికల్లో అధికారంలోకి తీసుకు రావాలని కృతనిశ్చయంతో ఉన్న రేవంత్ రెడ్డి తనను రాజకీయంగా పాతాళానికి తొక్కేయాలని కుట్ర

## తనను తొక్కేయాలనుకుంటే

# తొక్కి నార తీశాడు

**అణిచేద్దామని చూస్తే ఫీనిక్స్ పక్షిలా లేచి నిలబడ్డాడు**



చేసిన కేసీయార్ ను ముఖ్యమంత్రి గద్దె నుండి దించాల్సిందేనని కంకణం కట్టుకున్నారు. పార్టీ విజయం కోసం అహోరాత్రులూ శ్రమించారు.

కాంగ్రెస్ వంటి దిగ్గజ పార్టీలో  భిన్న వర్గాల నేతలు..తనకంటే ఎంతో సీనియర్లూ అయిన  నాయకులందరినీ ఒక్కతాటిపైకి తీసుకు రావడమే కాకుండా యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపారు. రేవంత్ రెడ్డి స్ఫూర్తితోనే కాంగ్రెస్  క్యాడర్ లో అగ్గి రాజుకుంది. కాంగ్రెస్ కార్యకర్తల గుండెల్లో నిదురించిన పౌరుషాగ్ని రగిలింది. కాంగ్రెస్ ను గెలిపించుకుని తీరాల్సిందేనని  పంతం పెరిగింది. ఒక్క ముక్కలో చెప్పాలంటే కాంగ్రెస్ పార్టీపై రేవంత్ రెడ్డి తనదైన ముద్ర వేశారు. ఆయన చేపట్టిన పాదయాత్రకు పాలక పక్షం అడుగడుగునా ఇబ్బందులకు గురి చేసింది. పోలీసులు ఆటంకాలు సృష్టించారు అధికారులు ఏ మాత్రం సహకరించలేదు. కొంతమంది నేతలూ కలిసి రాలేదు. అయితే అన్నిటినీ దిగమింగుకుని రెట్టించిన ఉత్సాహంతో అంతులేని  లక్ష్య దీక్షతో ముందుకు సాగారు. పాదయాత్ర సక్సెస్ అయ్యింది. కాంగ్రెస్  పార్టీకి ఊపు వచ్చింది. జనానికి కాంగ్రెస్ పార్టీపై నమ్మకం పెరిగింది. బి.ఆర్.ఎస్.



ఓటమికి అక్కడే  బీజం పడింది.2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. పార్టీలో అతిరథ మహారథుల వంటి నేతలు చాలా మంది ఉన్నారు. అయితే పార్టీ విజయంలో కీలక పాత్ర పోషించిన  రేవంత్ రెడ్డికే పార్టీ హైకమాండ్ ముఖ్యమంత్రి పదవిని కట్టబెట్టి న్యాయం చేసింది.






# అంతకుముందు అంతా ఒక లెక్క
# రేవంత్ అన్న వచ్చిన తర్వాత
# ఇంకో లెక్క






రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కాగానే కాంగ్రెస్ పార్టీలో చాలా మార్పులు వచ్చాయి. ప్రత్యేకించి కాంగ్రెస్ పాలనలో కొత్త పోకడ వచ్చింది. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ గ్యారంటీల అమలుకు ప్రమాణ స్వీకారం చేసిన రోజునుంచే శ్రీకారం చుట్టారు రేవంత్ రెడ్డి. యువతకు వేలాది ఉద్యోగాలు ఇచ్చారు. రైతులకు రుణమాఫీ చేశారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించారు.




గ్యాస్ సిలెండర్ల పథకాన్ని అమలు చేశారు. ఇలా ఒక్కో పథకాన్నీ అమలు చేస్తూనే రాష్ట్ర సమగ్రాభివృద్ధికి రేవంత్ రెడ్డి తనదైన శైలిలో దూసుకుపోతున్నారు. రెండేళ్ల పాలనలోనే గత బి.ఆర్.ఎస్. ప్రభుత్వం చేయలేకపోయిన ఎన్నో పనులను రేవంత్ రెడ్డి చేసి చూపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై దర్యాప్తునకు ఆదేశించారు. అవినీతి మకిలి అంటిన అధికారులను బోనెక్కించారు. కొత్త సాగునీటి ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మంత్రి వర్గంలోనూ అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యతను ఇచ్చి సామాజిక న్యాయం చేసి చూపించారు.





తెలంగాణాను అన్ని రంగాల్లో అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తోన్న రేవంత్ రెడ్డి హైదరాబాద్ లో ఐటీ కంపెనీలను మరింత విస్తరిస్తూ పారిశ్రామిక పెట్టుబడులు ఆకర్షిస్తూ కొత్త ఆశలు సాకారం చేస్తున్నారు. అదే సమయంలో హైదరాబాద్ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నగరాన్ని మరింతగా విస్తరించాల్సిన అవసరాన్ని గుర్తించారు. ప్రస్తుతం ఉన్న మూడు సిటీలకు అదనంగా ఫోర్త్ సిటీకి రూపకల్పన చేశారు. రాబోయే కొన్నేళ్లలో హైదరా బాద్

# హైదరాబాద్ తల రాత మార్చనున్న
# ఫోర్త్ సిటీ

## పారిశ్రామిక ప్రగతిలో అంతర్జాతీయ స్థాయి ముద్ర



ముఖచిత్రాన్నే మార్చడానికి పకడ్బందీ ప్రణాళికలతో రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారు. విద్య, వైద్య రంగాలకు పెద్ద పీట వేస్తూ..పారిశ్రామిక విప్లవం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ తెలంగాణా ఆదాయాన్ని ఎన్నో రెట్లు పెంచేలా నిర్ణయాలు తీసుకుని అమలు చేస్తున్నారు.











ఈ క్రమంలో బి.ఆర్.ఎస్ , బిజెపిలు ఎన్ని క్షుద్ర రాజకీయాలు చేసినా ఆయన వారిని ఖాతరు చేయకుండా ముందుకు సాగుతున్నారు. అనుకున్న లక్ష్యాన్ని వీడకుండా సాహసంగా కదులుతున్నారు. నిజాయితీగా అడుగులు వేస్తే ఆ దేవుడు కూడా తమనే ఆశీర్వదిస్తాడని రేవంత్ రెడ్డి నమ్ముతారు. ఆయన కృషిని గమనించిన తెలంగాణా ప్రజలు రేవంత్ ను నమ్ముతున్నారు. ఇది తెలంగాణాకు స్వర్ణయుగమే అంటున్నారు మహేందర్ రెడ్డి

ఉద్యమంలో ఉక్కు పిడుగు

పోరాటంలో

అగ్గిపిడుగు







# సమైక్య పాలకుల దుర్నీతిని ఎండగట్టిన భూమి పుత్రుడు



ఎప్పుడూ చిరునవ్వుతో కనిపించే రేవంత్ రెడ్డి గుండెల్లో అగ్ని పర్వతాలూ ఉన్నాయి. తర తరాలుగా దోపిడీకి గురవుతోన్న తెలంగాణా జాతి జనుల దుర్భర జీవితాలను తలచుకుని అనుక్షణం రగిలారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన సాంకేతికంగా తెలుగుదేశం పార్టీలో ఉన్నారు. అయితే ఉద్యమంలో మాత్రం రాజీలేకుండా  పోరాడారు. తెలంగాణా ఉద్యమంలో అన్ని ప్రజాసంఘాలతో కలిసి అడుగులు వేశారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో ఉద్యమ సమయంలో అసెంబ్లీలోనే  సమైక్య పాలన తీరును ఎండగట్టారు రేవంత్ రెడ్డి. అది కూడా మామూలుగా కాదు.

S tv SANDESH
ప్రతి మాట విలువైనది - ప్రతి దృశ్యం అరుదైనది

సమైక్య పాలనలో ఆంధ్ర పాలకులు తెలంగాణాలో సాగునీటి ప్రాజెక్టులు కట్టకపోబట్టే అది ఎడారిగా మారే దుస్థితి నెలకొందని నిప్పులు చెరిగారు. తెలంగాణ ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టులు లేవు కాబట్టే తెలంగాణ రైతులు 17లక్షలకు పైగా బోర్లు వేసుకోవలసి వచ్చిందన్న రేవంత్ రెడ్డి ఆ బోర్లు ప్రభుత్వం ఇచ్చినవి కావని కుండ బద్దలు కొట్టారు. తెలంగాణా రైతుల గోసను శాసన సభ వేదికగా వినిపించారు. తెలంగాణ రైతులు తమ భార్యల పుస్తెలు అమ్మి..భూములు అమ్మి..ఆస్తులు గిరివి పెట్టి.. లక్షల అప్పులు చేసి పస్తులు ఉండి ఆ డబ్బుతో బోర్లు వేసుకున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. సమైక్య పాలనలో మేం ఎందుకు ఉండాలి అధ్యక్షా ? అని సూటిగా ప్రశ్నించారు.








నా తండ్రి చనిపోయిన కార్యక్రమంలో శాస్త్ర ప్రకారం నేను స్నానం చేయాల్సి ఉంటే నీరు లేక నెత్తిమీద నాలుగు చుక్కలు చల్లుకోవలసి వచ్చిందని ఆక్రోశించారు. అటువంటి సమైక్య రాష్ట్రంలో మేం ఎందుకు ఉండాలి? అని నిలదీశారు. విజయవాడ థర్మల్ పవర్ స్టేషన్ కు సింగరేణి బొగ్గు గనుల నుండి 30లక్షల టన్నుల బొగ్గును తరలించుకుపోతున్నారు. ఇక్కడ మాత్రం మొండి చెయ్యి చూపిస్తారు. అసుంటి సమైక్య పాలనలో ఎందుకుండాలి





అధ్యక్షా? అని ప్రశ్నించారు. సాగు నీటి మాట దేవుడెరుగు మేం తాగునీరు అడుగుతున్నాం..అవి కూడా మాకు





ఇవ్వని సమైక్య రాష్ట్రంలో ఎందుకు కొనసాగాలి? అని మండి పడ్డారు. 60ఏళ్ల పాటు సమైక్య పాలకుల నెత్తిపై గొడుగులా..వారి కాళ్లకింద చెప్పుల్లా ఉన్నాం..ఇక ఉండే పరిస్థితి లేదు.. ఆకలితో చావనైనా ఛస్తాం కానీ సమైక్య పాలకులకు ఊడిగం చేయలేం వారి కాళ్లకింద చెప్పుల్లా ఉండలేం అని తెగేసి చెప్పారు

రేవంత్ రెడ్డి.

# ఏ పార్టీలో ఉన్నామన్నది కాదు ప్రశ్న

## తెలంగాణా సాధన కోసం కృషి చేశామా లేదా అన్నది పాయింట్




తెలంగాణా రాష్ట్ర ఏర్పాటుకు నాటి టిడిపి అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు సానుకూలంగా లేఖ ఇవ్వడంలో రేవంత్ రెడ్డి పాత్ర కూడా ఉందని చెప్పుచ్చునంటారు మహేందర్ రెడ్డి. 2014 ఎన్నికలకు ముందు కేంద్రంలోని కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీయే ప్రభుత్వం తెలంగాణా బిల్లును ఆమోదించింది. తెలంగాణా ఇస్తానన్న మాటకు కట్టుబడి ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియా గాంధీ తెలంగాణా రాష్ట్ర ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం వల్లనే అది సాధ్యమైంది. తెలంగాణా ఇచ్చిన సోనియా గాంధీకి తెలంగాణా ప్రజలంతా కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. చాలా మంది మనసుల్లోనే ఆమెకు ధన్యవాదాలు తెలుపుకున్నారు.



తెలంగాణా కలను సాకారం చేసిన కాంగ్రెస్ పార్టీ ఆ తర్వాత కాల క్రమంలో రేవంత్ రెడ్డి నాయకత్వ లక్షణాలు గుర్తించి తమ పార్టీలో చేర్చుకుంది. తెలంగాణా ఇచ్చిన పార్టీ కాబట్టే కాంగ్రెస్ లో చేరారు రేవంత్ రెడ్డి. అందుకే కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చే దాకా నిద్రపోనని శపథం చేసిన రేవంత్ రెడ్డి 2023 ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తెచ్చారు. ఈ విజయం తెలంగాణా కాంగ్రెస్ పార్టీ సమష్టి విజయమే . అయితే అం దర్నీ కలుపుకుంటూ దిగ్గజ నేతల మధ్య తానే ఇరుసుగా ఉంటూ ఎక్క డ తగ్గాలో అక్కడ తగ్గుతూ.. ఎక్కడ ఉరమాలో అక్కడ ఉరుముతూ దూసుకుపోయారు.









# పదవుల వెంట ఎన్నడూ పరుగులు పెట్టలేదు


## పదవులే రేవంత్ ను వెతుక్కుంటూ వచ్చి వరించాయి



2017లో కాంగ్రెస్ పార్టీలో చేరినపుడు రేవంత్ రెడ్డి పదవులు ఆశించలేదు. ఫలానా పదవి కావాలని నాయకత్వాన్ని అడగలేదు. రేవంత్ రెడ్డి దక్షతను నాయకత్వ పటిమను  పార్టీ పట్ల ఆయనకున్న చిత్తశుద్ధిని పార్టీ విజయంకోసం రేవంత్ వద్ద ఉన్న  ప్రణాళికలకను చూసి కాంగ్రెస్ హైకమాండే రేవంత్ రెడ్డికి పిసిసి అధ్యక్ష పదవిని కట్టబెట్టింది. అదొక ముళ్లకిరీటమే అని ఆయనకు తెలుసు. కాంగ్రెస్ లో తనకంటే  ఎంతో సీనియర్ నేతలు ఉన్నారని తెలుసు. పిసిసి అధ్యక్షుడైనంత మాత్రాన ఆ సీనియర్లందరికీ తాను బాస్ ని అని ఆయన అనుకోలేదు. అనుభవజ్ఞులైన సీనియర్ నేతలకు ఇవ్వాల్సిన గౌరవం ఇచ్చారు. వారి నుండి సలహాలు సూచనలు స్వీకరించారు. వారి ఆశీస్సులు అడిగి మరీ తీసుకున్నారు. హై కమాండ్ దిశానిర్దేశనం చేసిన మేరకు  పార్టీని ముందుకు నడిపారు. ఈ క్రమంలో ఎన్ని ఒడుదుడుకులు వచ్చినా వెరవలేదు.







కొన్ని అపార్థాలు వచ్చినా కంగారు పడలేదు. ఎంతో ఓపిగ్గా సంయమనంతో కాగ్రెస్ ను అధికారంలోకి తీసుకురావాలన్న ఏకైక అజెండాతో పార్టీలోని అన్ని వర్గాల నేతలతో కలిసి ముందడుగు వేశారు. అందుకే పార్టీకి అంతటి ఘన విజయం సాధ్యమైందని రేవంత్ రెడ్డి చాలా సందర్భాల్లో చెప్పారు కూడా. కాంగ్రెస్ విజయం పార్టీలని ప్రతీ ఒక్కరిదీ అని రేవంత్ రెడ్డి వినయంగానే అన్నారు. ఇలా ఏమీ ఆశించకుండా కష్టపడ్డం వల్లనే కావచ్చు కాంగ్రెస్ అధినాయకత్వం కూడా రేవంత్ రెడ్డినే పిలిచి ముఖ్యమంత్రి పదవిని కట్టబెట్టింది. ఆయన పదవి కోసం ప్రయత్నించలేదు. పదవే ఆయన్ను వెతుక్కుంటూ వచ్చిందని మహేందర్ రెడ్డి అంటున్నారు.




# హైదరాబాద్ ముఖచిత్రం మార్చే
# బృహత్ పథకం



## మూసీ ప్రక్షాళనతో అద్భుత అభివృద్ధికి పట్టం

పాలకులు వస్తారు. పోతారు. కానీ పాలకులు చేసిన మంచి పనులు మాత్రం తర తరాలుగా అలానే నిలిచిపోతాయి. కొంతమంది నేతల పేరు చెబితే వారు చేసిన మంచి పనులు టక్కున గుర్తుకు వస్తాయి. ఇందిరా గాంధీ పేరు చెబితే గరీబీ హఠావో, వాజ్ పేయ్ పేరు చెబితే స్వర్ణ చతుర్భుజి పథకం, రాజీవ్ గాంధీ పేరు చెప్పగానే భారత్ లో కంప్యూటర్ విప్లవం...ఎన్టీయార్ పేరు చెబితే రెండు రూపాయల కిలో బియ్యం..చంద్రబాబు పేరు చెబితే సైబరాబాద్ ,వై.ఎస్.ఆర్. పేరు చెప్పగానే ఆరోగ్యశ్రీ, జలయజ్ఞం పథకాలు గుర్తుకు వస్తాయి. పదవిలో ఉన్నప్పుడే తమని ఎన్నుకున్న ప్రజలకు ఏదో ఒకటి చేయాలని ప్రతీ పాలకునికీ ఉంటుంది.





అదే విధంగా తెలంగాణాకు మొట్టమొదటి కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్ రెడ్డికి కూడా ఒక మంచి కల ఉంది. అది జీవనదిలాంటి ఆరోగ్యకరమైన అద్భుతమైన అందమైన కల. హైదరాబాద్ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకుని ఆ తర్వాత కాల గమనంలో రక రకాల కారణాలతో అంతర్థానం అయిపోతూ వస్తోన్న ఓ జీవనదికి ప్రాణం పోయాలని రేవంత్ రెడ్డి నిశ్చయించుకున్నారు.రైతు మీద, వ్యవసాయం మీద, ప్రకృతి మీద, నీటి మీద, నీటిపై ఆధార పడే జీవరాశులమీద ప్రేమ ఉన్నవారు మాత్రమే ఇలాంటి కల కనగలరని మహేందర్ రెడ్డి విశ్లేషిస్తున్నారు. మూసీ నదికి పూర్వ వైభవం తీసుకురావాలని రేవంత్ రెడ్డి కంకణం కట్టుకున్నారు. అనంతగిరి కొండల్లో పుట్టిన మూసీ నది 260 కిలోమీటర్ల పాటు ప్రవహించి నల్లగొండ జిల్లా వజీరాబాద్ వద్ద కృష్ణా నదిలో కలిసేది. ఒకప్పుడు హైదరాబాద్ జంటనగరాల దాహార్తిని తీర్చే కృత్రిమ సరస్సులకు మూసీయే ఆధారంగా ఉండేది.




ప్రతి మాట విలువైనది - ప్రతి దృశ్యం అరుదైనది

అయితే నగర విస్తరణ క్రమంలో ..పారిశ్రామిక ప్రగతి ముసుగులో మూసీ నది కలుషితం అయిపోయింది. నగరంలోని మురుగునీరు అంతా మూసీ నదిలోకి వదలడం మొదలు పెట్టారు. పారిశ్రామిక కాలుష్యాన్నీ ట్రీట్ మెంట్ చేయకుండానే మూసీలోకి వదిలేస్తూ వచ్చారు. అందులో విష రసాయినాలూ ఉన్నాయి. ఇలా జీవనదిని నిర్దాక్షిణ్యంగా హతమార్చారు దశాబ్దాల పాటు పాలకులు. ఇంత వరకు ఏ పాలకుడూ మూసీ దుస్థితిని చూసి బాధపడలేదు. కలత చెందలేదు. దానికి గత వైభవం తీసుకురావాలని అనుకోలేదు. మూసీ అంతర్థానాన్ని చూస్తూ ఉండిపోయారు. అయితే రేవంత్ రెడ్డి మాత్రం మూసీ పునరుద్ధరణకోసం బృహత్ పథకానికే శ్రీకారం చుట్టారు. దశలవారీగా మూసీలోకి కలుషిత జలాలు విడుదల చేయడాన్ని నిలిపివేసి..మూసీలో ఒకప్పటిలా స్వచ్ఛమైన మంచి నీరు ప్రవహించేలా చేయాలని రేవంత్ రెడ్డి సంకల్పించారు.












అంతే కాదు లండన్ నగరానికి థేమ్స్
నదిలా..మన కోల్‌కత్తా నగరానికి హుగ్లీ నదిలా
ఢిల్లీ నగరానికి యమునా నదిలా మూసీ నది గల
గల పారుతూ మెరవాలని ఆయన భావిస్తున్నారు.
అంతే కాదు నగరంలో మూసీ ప్రవహించినంత
మేరా నదికి అటూ ఇటూ ప్రజలు ఆహ్లాదంగా
సేదతీరేలా మౌలిక సదుపాయాలు
కల్పించడం..ప్రజల అవసరాలకు అనుగుణంగా
షాపింగ్ కాంప్లెక్సులు ఇతరత్రా సదుపాయాలను
ఏర్పాటు చేయడం ప్రాజెక్టులో భాగమే. ముందుగా
మూసీలో ఆక్రమణలను తొలగించి
ఆ తర్వాత ప్రాజెక్టును అమలు
చేయాలని నిర్ణయించారు.



ప్రక్షాళన..సుందరీకరణ చేయాలని రేవంత్ రెడ్డి సంకల్పించారు ఇందుకోసం లక్షన్నర కోట్ల రూపాయల వ్యయం అవుతుందని అంచనా వేశారు. అయితే ఈ ప్రాజెక్టు పూర్తయితే దీనికి పదింతల ఆదాయం ప్రభుత్వానికి



సమకూరడమే కాకుండా హైదరాబాద్ నగరం ముఖచిత్రమే చల్లగా మారిపోతుంది. 2030 -2032 ప్రాంతానికి ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఇప్పటికే వేలాది ఆక్రమణలు తొలగించారు. ఈ క్రమంలో ఏళ్ల తరబడి మూసీ నది తీరాన నిబంధనలకు విరుద్ధంగా నివసిస్తోన్న పేదలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను ప్రభుత్వమే చేపట్టేలా ప్రణాళికల రూపొందించారు. దీంతో పాటు మూసీ నదిపై అనేక వంతెనలనూ నిర్మించనున్నారు. సాయంత్రం అయితే చాలు మూసీ నదీ తీరాన సేద తీరి రావాలని నగర ప్రజలు అనుకునేంతగా మూసీ










ఇంత పెద్ద ప్రాజెక్టును భుజాలకెత్తుకున్న రేవంత్ రెడ్డి గంగా నది ప్రక్షాళన తరహాలో కేంద్ర ప్రభుత్వం మూసీ పునరుద్ధరణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అయితే సహజంగానే ఈ ప్రాజెక్టుకు కూడా విపక్షాల నుండి అభ్యంతరాలు, విమర్శలు వెల్లువెత్తాయి. పేదల ఇళ్లు తొలగిస్తున్నారని వారికి అన్యాయం చేస్తున్నారని బిఆర్ఎస్, బిజెపిలు ఆరోపిస్తున్నాయి. అయితే గతంలో బిఆర్ఎస్ కూడా మూసీ ప్రక్షాళన చేస్తామనే చెప్పింది. కానీ చేయలేదు. ఇపుడురేవంత్ రెడ్డి హయాంలో ఈ ప్రాజెక్టు పూర్తి అయితే అది కాంగ్రెస్ కు అడ్వాంటేజ్ అవుతుందన్న భయంతోనే బిఆర్ఎస్ బిజెపిలు దీన్ని అడ్డుకునే కుట్రలకు తెరతీస్తున్నాయని కాంగ్రెస్ ఆరోపిస్తోంది.



# పెద్దలను గౌరవిస్తారు..ఆ పెద్దలే అడ్డొస్తామంటే

# పోరాటానికీ సై అంటారు

## రేవంత్ రెడ్డి చాలా భిన్నమైన రాజకీయ నేత

ఆయనకంటూ అసలు శత్రువులే లేరు. ఈ మాట ఆయనే చెబుతారు. ఆయనకు రాజకీయ ప్రత్యర్థులు ఉండచ్చు కానీ ఏ పార్టీ నేత కూడా ఆయనకు శత్రువు కారు. అభిప్రాయ బేధాలు, సైద్ధాంతిక తేడాలు ఉంటే ఉండచ్చు. ముఖ్యమంత్రిగా ఆయన తెలంగాణాకు ఏది అవసరమో అది చేస్తారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తారు. తన జాతి జనులకు నష్టం తెచ్చే వారు ఎవరైనా సరే వారితో పోరాటాలకు ఉరుకుతారు. రాజకీయంగా ఆయన 2009లో టిడిపిలో చేరారు. చాలా చురుకైన నేత కాబట్టి తిరుగులేని వాగ్ధాటి ఉంది కాబట్టి సహజంగా రేవంత్ రెడ్డి పార్టీలో దూసుకుపోయారు. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడి దృష్టిలోనూ పడ్డారు. టిడిపిలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు రేవంత్ రెడ్డికి బాస్. చంద్రబాబు ఆదేశాలను శిరసావహించడమే ఆయన బాధ్యత. ఆయన అదే చేశారు.










2017లో కాంగ్రెస్ లో చేరారు. ఆ పార్టీ హైకమాండ్ ఆదేశాలమేరకే ఆయన వ్యవహారాలు నడుపుకొస్తున్నారు. అయితే ముఖ్యమంత్రి అయిన తర్వాత తెలంగాణాకు సంబంధించిన సాగునీటి ప్రాజెక్టులపై రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. అయితే రాష్ట్ర విభజన అనంతరం తమ ప్రాజెక్టులకు ఆంధ్ర ప్రదేశ్ అడ్డంకులు సృష్టించకుండా స్నేహభావంతో మనసులు గెలుచుకోవాలన్నది రేవంత్ రెడ్డి ఆలోచన. ఒకప్పటి తన లీడర్..ప్రస్తుత ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దేశంలోనే అత్యంత అనుభవజ్ఞుడైన రాజకీయ నేత. అయితే కొన్ని తెలంగాణా ప్రాజెక్టులకు ఏపీ నుంచి ఇబ్బందులు వచ్చే అవకాశంఉందని గమనించిన రేవంత్ రెడ్డి చంద్రబాబు నాయుడికి బహిరంగంగానే విజ్ఞప్తి చేశారు. అయ్యా చంద్రబాబు గారూ మీరు దయచేసి మా ప్రాజెక్టులకు అడ్డురాకండి.





మా దిండి ప్రాజెక్టును అడ్డుకోవద్దు


మా భీమా ను అడ్డుకోకండి

మా నెట్టెంపాడు , కోయిల సాగర్ లను అడ్డుకోకండి

మా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ఇబ్బందులు తీసుకురాకండి...దయచేసి శ్రీశైలం ప్రాజెక్టు నుండి 4 టిఎంసీలు తీసుకుపోయేందుకు వెసులు బాటు ఉండగా ఏకంగా తొమ్మిదిన్నర టిఎంసీల నీటిని తరలించుకుపోయేలా ప్రాజెక్టులు కడుతున్నారు. ఒకప్పుడు మీరు పాలమూరున దత్తత తీసుకున్నామని చెప్పారు. రెండు ప్రాంతాల అభివృద్ధి కోరుకునే వారే అయితే రాయలసీమ ఎత్తిపోతల పథకం ద్వారా మూడు టిఎంసీల నీటిని తరలించే ప్రాజెక్టును రద్దు చేయండి. మా ప్రాజెక్టులు పూర్తి చేసుకోడానికి మాకు సహకరించండి.



ఉదారంగా వ్యవహరించండి. పాలమూరు ప్రజలు ఎవరు సాయం చేసినా మర్చిపోరు గుండెల్లో పెట్టుకుంటారు. మీ సాయాన్ని జీవితాంతం మర్చిపోరు. ఇది కాదని మీరు మా ప్రయోజనాలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటే మాత్రం పోరాటాలు పాలమూరు బిడ్డలకు కొత్త కాదు. పాలమూరు అంటేనే పౌరుషాలకు నిలయం. ఆ పోరాటానికి నేనే నాయకత్వం వహిస్తాను అని రేవంత్ రెడ్డి బహిరంగంగా పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రికి ఎంతో హుందాగా తన మనసులో మాటను తెలియ జెప్పారు. ఇది నిజంగానే తిరుగులేని దౌత్య నీతి అంటారు మేధావులు. అంతే కాదు కృష్ణా, గోదావరి జలాల్లో ఏపీ ఎంత నీటిని వినియో గిస్తోంది. .తెలంగాణ ఎంత వాడుకుంటోంది అన్న అంశాల్లో కచ్చితమైన లెక్కలు తేల్చేందుకు టెలిమెట్రీని అమలు చేయమని చెప్పి శాశ్వత పరిష్కారాన్ని రేవంత్ రెడ్డి రివర్ బోర్డుకు సూచించి చరిత్ర సృష్టించారు.





# హైదరాబాద్ దశ ..దిశ మార్చే ఫార్చ్యూన్ తీసుకు వస్తాం

## తెలంగాణా గ్రామాలు కళ కళలాడే కంపెనీలు రప్పిస్తాం

ముఖ్యమంత్రి కాగానే సంక్షేమ పథకాలకు పెద్ద పీట వేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒకదాని తర్వాత ఒకటిగా అమలు చేసుకుంటూ పోతున్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ముందుకు సాగుతున్నారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు..అందరికీ మేలు చేసే పథకాలను అమలు చేస్తున్నారు. ఉపాధి అవకాశాలు




పెంచేలా పెట్టుబడులు ఆకర్షించేందుకు దేశవిదేశాల్లో పర్యటించి అంతర్జాతీయ స్థాయి కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంటున్నారు. అందుకే పెట్టుబడుల వరద కొనసాగుతోంది. ఈ క్రమంలోనే ఫ్యూచర్ సిటీకి అంకురార్పణ చేసిన రేవంత్ రెడ్డి ఓ కీలక ప్రకటన చేశారు.' ప్రపంచంలోనే అద్భుతమైనవి ఫార్చ్యూన్ 500 కంపెనీలు. అయితే హైదరాబాద్ లో ప్రస్తుతం ఫార్చ్యూన్ కంపెనీలు 85 మాత్రమే ఉన్నాయి. రానున్న పదేళ్లలో తెలంగాణలో 500 ఫార్చ్యూన్ కంపెనీలు ఏర్పాటు చేయించేపూచీ నేను తీసుకుంటున్నాను. మీ గ్రామానికి..మీ ఊరికి అంతర్జాతీయ కంపెనీలు తీసుకు వస్తాను. ఫ్యూచర్ సిటీకి పెట్టుబడుల వరద పారిస్తాం.



తెలంగాణా అభివృద్ధికి కొత్త నిర్వచనం ఇస్తాం. దేశంలో ఇతర రాష్ట్రాలు అసూయపడేలా తెలంగాణాను ప్రగతి పథంలో పరుగులు పెట్టిస్తాం' అని రేవంత్ రెడ్డి తన దృఢ సంకల్పాన్ని వ్యక్త పరిచారు. అన్ని వర్గాల ప్రజలకూ తాను చేదోడు వాదోడుగా ఉంటానని భరోసా ఇస్తూ ముందుకు సాగుతున్నారాయన. అందుకే 20 నెలల పాలన పట్ల తెలంగాణ ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తుపై నమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నారు.





# రేవంత్ రెడ్డి ఆదేశాలతో

# హైడ్రా దూకుడు

## దురాక్రమణదారుల గుండెల్లో పచ్చులపిడి బాకు

రేవంత్ రెడ్డి అనగానే ఇపుడు మరోటి కూడా గుర్తుకు వస్తోంది. అదే హైడ్రా. ప్రజలు తమకు అధికారం కట్టబెట్టింది ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించి ధర్మకర్తగా వ్యవహరించమనే అని అంటారు రేవంత్ రెడ్డి. ఆ ఉద్దేశంతోనే గ్రేటర్ పరిధిలో అన్యాక్రాంతమైపోయిన ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలు కూల్చి కబ్జాలు తొలగించాలని నిర్ణయించారు. అదే విధంగా పూర్వీకులు మనకు అందించిన జలవనరులు అయిన చెరువులు, కుంటలు, సరస్సులను దుర్మార్గంగా చెరబట్టిన భూబకాసురలకు చెక్ చెప్పి చెరువులను రక్షించి వాటిని సుందరీకరించాలని రేవంత్ రెడ్డి సంకల్పించారు. ఈ ఉద్దేశంతోనే 2024 జులైలో హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ- హైడ్రా ను ఏర్పాటు చేశారు.ఇది ల్యాండ్ మాఫియాకు కంటి మీద కునుకులేకుండా చేస్తోంది. ఆక్రమణల తొలగింపే లక్ష్యంగా ఉక్కు



సంకల్పంతో బరిలో దిగిన హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ సారథ్యంలో కొరడా ఝుళిపిస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2500చదరపు కిలోమీటర్ల పరిధిలో ఆక్రమణల తొలగింపే హైడ్రా ప్రధాన లక్ష్యం. దీనికోసమే మూడు వేల మందికి పైగా సుశిక్షితులైన సిబ్బందిని కేటాయించారు. 72 టీంలు ఆక్రమణలను గుర్తించి అక్రమార్కులకు నోటీసులు ఇచ్చి వాటిని తొలగించే పనిలో నిమగ్నమయ్యాయి.

S tv SANDESH



ముఖ్యమంత్రి ఫ్రీ హ్యాండ్ ఇవ్వడంతో హైడ్రా బృందాలు చెరువులు, కుంటలు, పార్కులు, ప్రభుత్వ భూములను చెరబట్టి అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను కూల్చివేస్తున్నాయి. దీంతో కబ్జా మాఫియాకు ఊపిరాడ్డం లేదు. ఇప్పటికే హైడ్రా వందలాది చెరువుల్లో ఆక్రమణలను తొలగించింది. వందల ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంది.ప్రభుత్వ



భూములు కానీ, చెరువులు కానీ, కుంటలు కానీ ఎవరైనా కబ్జా చేసినట్లు తేలిందా..వారు ఎవ్వరైనా సరే తాట ఒలిచి కబ్జా తొలగించి ఇంటికి పంపిస్తా అంటున్నారు రంగనాథ్. అదే దూకుడుతో రాజీలేకుండా దూసుకుపోతున్నారు.

చెరువులు,కుంటల ఆక్రమణలు తొలగించాలన్న రేవంత్ రెడ్డి ఆలోచన నిజంగానే అద్భుతమైనది. ఎందుకంటే దశాబ్దాల క్రితం హైదరాబాద్ లో రెండున్నర వేలకు పైగా చెరువులు ఉండేవి. నేడు అవి ఆరేడు వందలకు తగ్గిపోయాయి. మిగతా చెరువులను ల్యాండ్ మాఫియా చెరబట్టింది. కుంటలను వదల్లేదు. నాలాలను మిగల్చలేదు. పార్కులను క్షమించలేదు. ప్రభుత్వ భూములను విడిచి పెట్టలేదు. జాగా కనిపిస్తే




చాలు అమాంతం చెరబట్టేస్తూ వస్తున్నారు అక్రమార్కులు. చెరువులన్నీ కబ్జా కావడం వల్లనే గ్రేటర్ లో చిన్నపాటి వర్షం కురిసినా వీధులన్నీ జలమయం అవుతున్నాయి. కాలనీలన్నీ చెరువులవుతున్నాయి.







నగరమే ఓ సముద్రం అవుతోంది. ఈ పాపం అంతా కబ్జాలదే. ఇంత కాలం అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలు అండగా నిలవడంతోనే ఈ అక్రమాలు ఇలా కొనసాగుతూ వచ్చాయి. రేవంత్ రెడ్డి వీటికి చెక్ చెప్పాలని నిశ్చయించారు. అందుకే హైడ్రాను నామమాత్రంగా ఏర్పాటు చేయకుండా ఉక్కుపిడుగు వంటి ఐపీఎస్ అధికారి రంగనాథ్ ను కమిషనర్ గా నియమించారు. అంతటితో ఆగకుండా కావల్సిన సిబ్బందిని మౌలిక సదుపాయాలనూ కల్పించారు. 15 నెలల వ్యవధిలో వేల కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ ఆస్తులను కబ్జా కోరుల చెర నుండి విడిపించింది హైడ్రా. అదే విధంగా చారిత్రక చెరువులకు పూర్వ వైభవం తెచ్చింది హైడ్రా. బతుకమ్మ కుంట వైభవమే దానికి తిరుగులేని నిదర్శనం అంటున్నారు మహేందర్ రెడ్డి.

# దావోస్ వెళ్లారు లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చారు

## హైదరాబాద్ ను అంతర్జాతీయ హబ్ గా మార్చారు

రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత విపక్షాలు ఒకరకమైన విమర్శ చేస్తూ వచ్చాయి. హైదరాబాద్ లో ప్రగతి ఆగిపోయిందని..పెట్టుబడులు రావడం లేదని ప్రచారం చేశారు. వీటన్నింటినీ మౌనంగా ఆలకిస్తూనే రేవంత్ రెడ్డి తన మనసులో కొన్ని ప్రణాళికలు సిద్ధం



చేసుకున్నారు. ఈ క్రమంలోనే దావోస్ వెళ్లారు. వివిధ దేశాలకు చెందిన దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో చర్చలు జరిపారు. హైదరాబాద్ నగరంతో పాటు తెలంగాణా జిల్లాల్లో పెట్టుబడులకు ముందుకు రావాలని వారిని ఆహ్వానించారు. తెలంగాణలో కంపెనీలు పెడితే ప్రభుత్వ పరంగా అందించే ప్రోత్సాహకాల గురించి వివరించారు. కంపెనీలకు అనుమతులు ఇవ్వడం దగ్గర నుంచి మౌలిక సదుపాయాల కల్పనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని వివరించారు. రేవంత్ రెడ్డి తో చర్చల కారణంగా పారిశ్రామిక వేత్తల్లో తెలంగాణపై




నమ్మకం కుదిరింది. అందుకే దావోస్ పర్యటనలో ఏకంగా ఒక లక్ష 80 వేల కోట్ల రూపాయల విలువజేసే పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయి. సన్ పెట్రో కెమికల్స్ హైదరాబాద్ లో 45,500 కోట్లు పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చింది.జె.ఎస్.డబ్ల్యూ. యూఏవీ సంస్థ 8వేల కోట్లు పెట్టుబడి పెడుతోంది.






దావోస్ పర్యటన విజయవంతం అవ్వడంతో హైదరాబాద్ పైనా తమ పాలనపైనా విషం చిమ్మిన కుట్రదారుల ప్రయత్నాలన్నీ పటాపంచలయ్యాయని రేవంత్ రెడ్డి అన్నారు. 2004 నుండి 2014 వరకు కేంద్రంలోని యూపీయే ప్రభుత్వం మన్మోహన్ సింగ్ సారథ్యంలో కొనసాగించిన సరళీకృత ఆర్థిక విధానాల వల్లనే ప్రపంచ దేశాలు మన దేశంలో పెట్టుబడులకు ముందుకు వస్తున్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. అలాగే జపాన్ లో నిర్వహించిన ఒసాకా ఎక్స్ పో 2025 లోనూ రేవంత్ రెడ్డి తన బృందంతో పాల్గొన్నారు. ఈ సమిట్ లో తెలంగాణ పెవిలియన్ ను ప్రారంభించారు రేవంత్ రెడ్డి. రానున్న కాలంలో ప్రపంచంలోనే హైదరాబాద్ ను ఒక ఇండస్ట్రియల్ హబ్ గా తీర్చిదిద్దుతామని రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. పెట్టుబడులు ఆకర్షించడం వల్ల తెలంగాణ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు రావడంతో పాటు ప్రభుత్వ ఆదాయమూ పెరుగుతుందన్నారు.




2023లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినపుడు అంతకు ముందు ఉన్న ప్రభుత్వం అమలు చేసిన విధానాల్లో ప్రజలకు మేలు చేసే విధానాలు ఉంటే వాటిని రాజకీయ కోణంలో పక్కన పెట్టకుండా హుందాగా కొనసాగించిన వైనాన్ని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అదే విధంగా తనకు ముందున్న ప్రభుత్వం చేపట్టిన వాటిలో తెలంగాణ ప్రజలకు మంచి జరుగుతుందనుకునే కార్యక్రమాలను మరింత పకడ్బందీగా అమలు చేస్తామని అన్నారు.



**అనిల్ కుమార్ కుంట....**

**సందేశ్ మీడియా...**

# దశ మార్చిన దళపతి

# సీఎం రేవంత్‌రెడ్డి

SANDESH PLUS

